ప్రణాళికతో చదివి విజయం సాధించాలి

- అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్

గద్వాల, మే 29: ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ప్రణాళికతో చదివి విజయం సాధించాలని అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఇప్పటికే బీసీ స్టడీసర్కిల్ ఆధ్వర్యంలో 60మంది అభ్యర్థులకు గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఉచితంగా పంపిణీ చేసిన మెటీరియల్‌లోని అంశాలను క్షుణ్ణంగా చదివి ప్రిలిమ్స్ అభ్యర్థులు మంచిగా పరీక్షలు రాసి విజయం సాధించాలన్నారు. ప్రభుత్వం పేద బీసీ విద్యార్థులకు చేయూతనివ్వాలనే ఆలోచనతో ఈ మెటీరియల్‌ను అందజేసిందని చెప్పారు. దీనిని సద్వినియోగం చేసుకొని మంచి ర్యాంకు సాధించి కొలువు పొందాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ అధికారి శ్వేతాప్రియదర్శిని, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ, పత్తి విత్తనాలు

- వ్యవసాయశాఖ జిల్లా అధికారి సురేందర్‌రెడ్డి
- విత్తనాల లభ్యతపై రాష్ట్ర డైరెక్టర్ టెలీకాన్ఫరెన్స్

వనపర్తి, మే 29: వానకాలం సీజన్ ప్రారంభంలో రైతుల కోసం వెయ్యి క్వింటాల జీలుగ, పత్తి విత్తనాలు జిల్లాలోని వివిధ మండలాలోని డీలర్ల వద్ద 11, 964 విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయశాఖ జిల్లా అధికారి సురేందర్‌రెడ్డి తెలిపారు. వానకాలం సీజన్ ప్రా రంభంలో రైతులకు అందుబాటులోని విత్తనాల లభ్యతపై వ్యవసాయశాఖ డైరెక్టర్ బుధవారం టెలీకాన్ఫరెన్స్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సమీక్షకు జిల్లా వ్యవసాయశాఖ అధికారి హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతేడాది జిల్లాకు 995క్వింటాళ్ల జీలుగ విత్తనాలు కేటాయించామని, ఈ సీజన్‌లో ఇప్పటి వరకు విత్తన అభివృద్ధి సంస్థ ద్వారా ప్రాథమిక వ్యవసాయ సొసైటీలు, ఆగ్రో రైతు సేవా కేంద్రాల్లో 772 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఇప్పటికే రైతులు 630 క్వింటాళ్ల విత్తనాలు రైతులు కొనుగోలు చేసినట్లు రికార్డుల్లో నమోదైందని పేర్కొన్నారు. దీనిని బట్టి జిల్లాకు మరో వెయ్యి క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలకు ప్రతిపాదనలు పంపామన్నారు. అలాగే జిల్లాలో పత్తిసాగుకు సంబంధించి గతేడాది 17,422 ఎకరాల్లో సాగు చేయగా ఈఏడాది 20వేల ఎకరాల్లో సాగు చేయొచ్చని అంచనా వేశామన్నారు. జిల్లాలో అమరచింత, ఆత్మకూరు, కొత్తకోట, మదనాపూర్, ఘణపురం, పెద్దమందడి, రేవల్లి మండలాల్లో పత్తిని సాగు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అంచనా ప్రకారం డీలర్ల వద్ద 11, 964 పత్తి విత్తన ప్యాకెట్స్ అందుబాటులో ఉంచామన్నారు. వీటిలో రైతు లు ఇప్పటి వరకు 2వేల ప్యాకెట్స్ కొనుగోలు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని పత్తిసాగు చేసే రైతులకు BG-II పత్తి విత్తనాలు ఏ కంపెనీకి సంబంధించిన రకాలైన దిగుబడిలో వ్యత్యాసం ఉండదన్న విషయాన్ని గుర్తించాలని తెలిపారు.

జోగుళాంబ గద్వాల జిల్లాలో..

గద్వాల, మే 29: వర్షాకాలం ప్రారంభమవుతున్నందున రైతులకు అవసరమైన అన్నిరకాల ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ సంతోష్, డీఏవో గోవింద్‌నాయక్ బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. 650 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇప్పటికే 381.9 క్వింటాళ్ల విత్తనాలు సరఫరా చేశామని తెలిపారు. 91.8 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, ఇంకా 268.1 క్వింటాళ్లు సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. పత్తి రైతులు బీటీ-2 హైబ్రిడ్ విత్తనాలు ఒకే విధంగా పని చేస్తాయని, ఒకే రకమైన కంపెనీ విత్తనాలు కాకుండా అందుబాటులో ఉన్న ఏ రకమైన కంపెనీ విత్తనాలైనా కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విడిగా ఉన్న సంచుల్లోని విత్తనాలు కొనుగోలు చేయొద్దని, ఆయా కంపెనీ లేబుల్ కలిగిన ప్యాకెట్లు కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన దుకాణం నుంచి రసీదును పొందాలని, వ్యవసాయశాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. విత్తనాల ఖాళీ ప్యాకెట్లు, బిల్లులను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలని సూచించారు.

చిన్నోనిపల్లిని సందర్శించిన ఆర్డీవో

గట్టు, మే 29: మండలంలోని చిన్నోనిపల్లి గ్రామాన్ని ఆర్డీవో రాంచందర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో గ్రామంలోకి ముంపు నీరు వచ్చే అవకాశం ఉందని, ఈ ఇబ్బందులు తొలగించాలని కోరారు. కాల్వ తవ్వించే ఏర్పాట్లు చేసి నీరు గ్రామంలోకి రాకుండా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హామీ ఇచ్చారు. పునరావాస కేంద్రంలో కొంతమందికి షిఫ్టింగ్ చార్జీలు రావాల్సి ఉందని చెప్పగా, త్వరలో వారికి అందేవిధంగా చూస్తానని హామీ ఇచ్చారు. 18ఏండ్లు నిండిన వారికి ప్లాటు ఇవ్వాలని కోరగా, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఆర్డీవో స్పష్టం చేశారు. సీ ఫారం తీసుకొని నిర్వాసితులకు మల్లన్నసాగర్ ముంపు బాధితుల జీవోను వర్తింపజేయాలని నిర్వాసితులు కోరారు. కార్యక్రమంలో తాసీల్దార్ సరిత, డిప్యూటీ తాసీల్దార్ సీహెచ్ రవికుమార్, ఇరిగేషన్ ఈఈ రహీముద్దీన్, జేఈ ఉపేంద్ర, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి విరాళం

పెబ్బేరు, మే 29: పట్టణంలోని కొత్తకోట రోడ్డులో సుంకులమ్మ ఆలయ పునర్నిర్మాణానికి దాతలు ముందుకొస్తున్నారు. ఆలయంతోపాటు, చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో పట్టణానికి చెందిన పలువురు వ్యాపారులు బుధవారం తమవంతుగా రూ.35వేల నగదును నిర్వాహకులకు అందజేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పాన్‌గల్, మే 29: మండలంలోని కేతేపల్లికి చెందిన దాంగట్ల విష్ణువర్ధన్‌రెడ్డి (58) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచులు కళావతమ్మ, ఊషన్న, ఎంపీటీసీ శ్యామల, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు శ్రీనివాస్‌నాయుడు మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★అర్జెంట్‌గా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & ITI మెకానిక్స్ కావలెను. మంచి జీతం, వసతి సౌకర్యం కలదు. సంప్ర.
9392663777, 9246663777, 9290003999.
NT-339514-All

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

- జూన్ 3నుంచి బడిబాట కార్యక్రమం
- మరమ్మతులు, ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు సిద్ధం చేయాలి
- కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

వనపర్తి, మే 29: జూన్ 3 నుంచి 19వరకు బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేవిధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ విద్యాశాఖాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అమ్మ-ఆదర్శ పాఠశాల, మన ఊరు-మనబడి కింద చేపడుతున్న మరమ్మతుల పనులు, ఏకరూప దుస్తులు, పుస్తకాల పంపిణీ, బడిబాట కార్యక్రమాలపై విద్యాశాఖ అధికారులతోపాటు ఇంజినీరింగ్, జెడ్పీసీఈవో ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బడిబాట కార్యక్రమంలో ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచుకోవాలన్నారు. అలాగే పునఃప్రారంభమయ్యేలోగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను సమకూర్చాలన్నారు. జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న పాఠశాలల్లో సైతం విద్యార్థులను చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యేనాటికి ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అమ్మ-ఆదర్శ పాఠశాల, మన ఊరు-మన బడి ద్వారా చేపడుతున్న పాఠశాలల్లో మరమ్మతులపై అధికారులతో క్షుణ్ణంగా సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడేదిలేదన్నారు. కేజీబీవీలు, సంక్షేమ పాఠశాలల్లో సైతం అన్ని పనులు పూర్తి చేయాలని ఆ దేశించారు. విద్యార్థులకు కల్పించే వసతులు, మౌలిక సదుపాయాల పై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గం గ్వార్, పంచాయతీ రాజ్ కార్యానిర్వాహక ఇంజినీర్ మల్లయ్య, జెడ్పీసీఈవో యాదయ్య, డీఆర్డీవో నాగేంద్ర, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

పకడ్బందీగా అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

వనపర్తి టౌన్, మే 29: జిల్లాలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జూన్ 3నుంచి ప్రారంభమయ్యే సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద పోలీస్ భద్రత, బందోబస్త్ ఏర్పాట్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ తదితర ఏర్పాట్లు పక్కగా ఉండాలన్నారు. ఈ పరీక్షల్లో 964 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. ఆర్టీసీ బస్సులు సమయానికి నడపాలని అధికారులకు సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద మౌలిక వసతులతోపాటు ప్రథమ చికిత్స కిట్లతో ఏఎన్ఎం, ఆశా వర్కర్లను నియమించాలని వైద్యాధికారిని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచేవిధంగా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఉండాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, నగేశ్, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

పాన్‌గల్, మే 29: పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా మౌలిక వసతులు సిద్ధం చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. బుధవారం మండలంలోని దవాజీపల్లి, దొండాయిపల్లి, రాయినిపల్లిని సందర్శించి అమ్మ-ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. అమ్మ-ఆదర్శ పాఠశాల ద్వారా చేపట్టే మరమ్మతులు, మౌలిక సదుపాయాలను వేగవంతం చేయడమే కాకుండా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థులకు అసౌకర్యం కాకుండా తాగునీటి వసతి, వంటగది, మరుగుదొడ్లు తదితర పనులు చేపట్టాలని కోరారు. దవాజీపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. గుడ్లు, పాలు తదితర సామగ్రి నిల్వలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి లక్ష్మీబాయి, ఎంపీడీవో కోటేశ్వర్, ఎంపీవో రఘురాం, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, ఏపీవో కుర్మయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల నియంత్రణపై నిఘా

- జోగుళాంబ గద్వాల ఎస్పీ రితిరాజ్

గద్వాల అర్బన్, మే 29: జిల్లాలో నకిలీ విత్తనాల రవాణా, ఉత్పత్తి, క్రయ విక్రయాలు జరిపి రైతులను మోసం చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ రితిరాజ్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పనిచేసే రైతులు మోసపోకుండా ఉండేందుకు జిల్లాలో నకిలీ సీడ్స్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు విషయాలను సూచించారు. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో గతంలో నమోదైన నకిలీ విత్తనాల కేసుల వివరాలను పరిశీలించారు. ఆయా కేసుల్లో నిందితులపై పోలీస్ అధికారులు నిఘా ఉంచాలని, ప్రస్తుతం వారు ఎలా జీవనం కొనసాగిస్తున్నారు తదితర వివరాలు తెలుసుకొని నిఘా ఉంచాలని ఆదేశించారు. కేసుల్లో సాక్ష్యాధారాలు సేకరించడంతోపాటు ఎఫ్ఎస్ఎల్, ఏవో రిపోర్ట్ పకడ్బందీగా పరిశీలించి నిందితులకు శిక్ష పడేందుకు కృషిచేయాలని సూచించారు. కర్ణాటక, ఏపీ సరిహద్దు గ్రామాల్లో పీపీవోల ద్వారా నిఘా ఉంచాలని, నకిలీ విత్తనాలు జిల్లాలోకి రాకుండా, జిల్లా నుంచి బయటకు వెళ్లకుండా చూడాలని, దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలన్నారు. రైతులు కూడా గుర్తింపు పొందిన కంపెనీ డీలర్ల వద్ద మాత్రమే సీడ్స్‌ను కొనాలని సూచించారు. అనంతరం అరెస్ట్, ఎన్‌బీ డబ్ల్యూఎస్ పెండింగ్ కేసులపై సమీక్షించారు.

కొత్త చట్టాలపై శిక్షణ తరగతులు ప్రారంభం

జూలై నుంచి అమల్లోకి రానున్న కొత్త చట్టాలైన భారతీయ భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత చట్టాలపై ప్రతి పోలీస్ అధికారి, సిబ్బందికి అవగాహన ఉండాలని సూచించారు. కొత్త చట్టాలపై శిక్షణకు జిల్లా నుంచి వెళ్లి వచ్చిన పోలీస్ అధికారులతో ఇతర పోలీసులకు అవగాహన కల్పించే శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఎస్పీ రితిరాజ్ ప్రారంభించారు. సమీక్షలో డీఎస్పీ సత్యనారాయణ, సీఐలు భీంకుమార్, రవిబాబు, రత్నం, ఎస్సైలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ రితిరాజ్

నకిలీ విత్తనాలు కొనుగోలు చేయొద్దు

ఆత్మకూరు, మే 29: రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని వ్యవసాయ విస్తరణ అధికారి సింధూజ అన్నారు. బుధవారం మండలంలోని ఆరెపల్లి, తిప్డంపల్లిలో విత్తన కొనుగోళ్లపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనాల ప్రాముఖ్యత, వాటి లాభాలు, తీసుకునే జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రైతులు తప్పనిసరిగా విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి రసీదును తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వ్యవసాయశాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. లూజు సంచుల్లో విత్తనాలను కొనుగోలు చేయొద్దన్నారు. నకిలీ విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రముఖులు, రైతులు పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

మల్దకల్, మే 29: ప్రభుత్వం వానకాలం సీజన్‌కుగానూ రైతులకు సబ్సిడీపై వరి, జీలుగ విత్తనాలను అందజేస్తున్నదని, వీటిని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండ్ అధ్యక్షుడు తిమ్మారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ వరి, జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించింది. ముఖ్య అతిథిగా సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి హాజరై రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ప్రతి రైతు పాసుబుక్కు,ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏవో రాజశేఖర్, సీఈవో కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏఈవోలు భాజా, భాస్కర్, సింగిల్ విండో డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు

అలంపూర్, మే 29 : మండలకేంద్రంలోని పీఏసీసీఎస్ కార్యాలయంలో రైతులకు కావాల్సిన పచ్చి రొట్ట ఎరువులు, జీలుగ విత్తనాలు రాయితీపై అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని ఏవో అనిత అన్నారు. ఎరువులు అవసరం ఉన్న రైతులు భూమి పాసు పుస్తకం తీసుకొస్తే హెక్టారుకు 30కేజీల పచ్చి రొట్ట ఎరువుల బ్యాగు అందజేస్తామని తెలిపారు. 30 కేజీల బ్యాగు విలువ రూ.2,790 కాగా సబ్సిడీ రూ.1,674 పోనూ రూ.1,116 చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పీఏసీసీఎస్ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, సీఈవో కేశవరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రసీదులు ఇవ్వాలి

కేటీదొడ్డి, మే 29: ఎరువుల దుకాణంలో విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పకుండా రసీదులు ఇవ్వాలని ఏడీఏ సంగీతలక్ష్మి సూచించారు. మండలంలోని నందిన్నెలో బుధవారం విత్తన దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనాలను ఎమ్మార్పీకే అమ్మాలని, రైతులు కొనుగోలు చేసిన విత్తనాల డేటాను ఎప్పటికప్పుడు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారి మహాలక్ష్మి ఉన్నారు.

కూలిన మట్టి మిద్దె..తప్పిన ప్రమాదం

వీపనగండ్ల, మే 29: మండలంలోని గోవర్ధనగిరిలో ముంత కుర్మయ్యకు చెందిన మట్టి మిద్దె బుధవారం సాయంత్రం అకస్మాత్తుగా కూలిపోయింది. గ్రామస్తుల కథనం మేరకు.. ఇంటి బయట అందరూ కూర్చొని మాట్లాడుతుండగా పాతబడిన మట్టి మిద్దె పైకప్పు అకస్మాత్తుగా కూలిపోయింది. అదృష్టవశాత్తు ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం అందజేయాలని స్థానికులు కోరారు.

మత్తురహిత జిల్లాగా మార్చుదాం

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

గద్వాల, మే 29: జోగుళాంబ గద్వాల జిల్లాను గంజాయి, మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో మాదకద్రవ్యాల నిర్మూలనకు నార్కోటెక్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో సంబంధిత అధికారులతో మాట్లాడారు. జిల్లాలో నిషేధించబడిన మత్తు పదార్థాల సరఫరా లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలల వద్ద డ్రగ్స్ విక్రయించకుండా పూర్తి నిఘా ఉంచాలన్నారు. జిల్లాలో గంజాయి సాగు జరుగకుండా అధికారులు సమన్వయంతో పర్యవేక్షించాలన్నారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే నష్టాలపై జూన్ చివరివారంలో ప్రతి మండలంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లా ప్రజలు మత్తు పదార్థాలు వినియోగించకుండా, యువత మత్తుకు బానిస కాకుండా తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్డీవో రాంచందర్, డీఎస్పీ సత్యనారాయణ, ఎక్సైజ్ అధికారులు అరుణ్‌కుమార్‌తోపాటు సుధారాణి, దేవరాజు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

నార్కోటిక్ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

యూకో బ్యాంక్ రోడ్డులో ప్రారంభమైన విస్తరణ పనులు

వనపర్తి, మే 29: పట్టణంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు ఎన్నికల కోడ్‌తో ఎనిమిది నెలలుగా నిలిచిపోయాయి. రోడ్డు విస్తరణ పనులు ఆగిపోవడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పట్టణ కేంద్రంలోని యూకో బ్యాంక్ రోడ్డు మార్గాన నిలిచిపోయిన పనులను బుధవారం కాంట్రాక్టర్ ప్రారంభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే అసంపూర్తిగా ఉన్న రోడ్డు వెడల్పు పనులను పూర్తిచేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేయాలని కోరారు. గత ప్రభుత్వంలోని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి చొరవ తీసుకొని ప్రజలను ఒప్పించి రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారని ప్రజలు గుర్తు చేశారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

రాజోళి, మే 29: బాల్య వివాహాలను అరికట్టాడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంపీవో భాజా అన్నారు. మండల కేంద్రంలో ఎమ్మార్సీ భవనంలో మండల స్థాయి కిశోర బాలికల సమావేశం ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ హనిమిరెడ్డి అధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ బాలికలు చదువుపై దృష్టి సారించేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో రామలింగేశ్వర ప్రసాద్, ఎంవీ ఫౌండేషన్ సభ్యులు, కానిస్టేబుల్ రామాంజనేయులు, కిశోర బాలికల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాలసాహిత్య సమ్మేళనంలో ప్రతిభ

కొత్తకోట, మే 29: హైదరాబాద్‌లోని అబిడ్స్‌లో ఉన్న దేవులపల్లి రామానుజన్ రావు కళామందిర్‌లో తెలంగాణ రాష్ట్ర సారస్వత పరిషత్ రాష్ట్రస్థాయి బాల సాహిత్య సమ్మేళన కార్యక్రమాన్ని ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహించారు. సమ్మేళనంలో ఆరోగ్యం-విజ్ఞానం అనే బాలల సైన్స్ గ్రంథాన్ని పద్మభూషణ్ డాక్టర్ వరప్రసాద్ రెడ్డి, సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, రమణాచారి, జుర్రు చెన్నయ్య ఆవిష్కరించారు. గ్రంథంలో కొత్తకోట మండలం అమడబాకుల మోడల్ స్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తుర్పింటి నరేశ్‌కుమార్ రాసిన సైన్స్ వ్యాసాలు ప్రచురించబడ్డాయి. అదేవిధంగా ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ఆహ్వానించబడిన బాల సాహితీ వేత్తలతో బడిలో తెలుగు భాష సదస్సును ఏర్పాటు చేయగా.. నరేశ్‌కుమార్ వక్తగా పాల్గొని మాట్లాడారు. బడిలో తెలుగు భాషా బోధనలో ఎదురవుతున్న ఇబ్బందులు, సవాళ్లు, సమస్యలు, పరిష్కారాలు వంటి అంశాలపై సుదీర్ఘంగా 15నిమిషాలపాటు మాట్లాడి అబ్బురపర్చాడు. అనంతరం నరేశ్‌కుమార్‌ను సాహితీవేత్తలు సన్మానించారు. కార్యక్రమంలో వనపర్తి సాహితీ వేత్తలు జనజ్వాల, నారాయణరెడ్డి, నాయకంటి నర్సింహ్మశర్మ, భైరోజు చంద్రశేఖర్, తిరుమలేశ్, సత్తార్, శివలింగం తదితరులు ఉన్నారు.

నరేశ్‌కుమార్‌ను సన్మానిస్తున్న సాహితీవేత్తలు

నేటి నుంచి షా- అలీ ఫహీల్వాన్ ఉత్సవాలు

అలంపూర్, మే 29 : అలంపూరు పట్టణంలో 700ఏండ్లుగా షా -అలీ ఫహీల్వాన్ ఉత్సవాలు మత సామరస్యతకు ప్రతీకగా కొనసాగుతున్నాయి. నాలుగురోజుల పాటు కొనసాగే ఉత్సవాలకు కర్ణాటక, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. మొదటి రోజు 30వ తేదీన గంధం, 31న చిన్న కిస్తీలు, జూన్ 1న పెద్ద కిస్తీలు, నాలుగో రోజు 2వ తేదీన మహిళా ఉర్సు నిర్వహిస్తారు. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లను నిర్వాహకులు, ఆయా శాఖల అధికారులు సిద్ధం చేశారు. మొదటి రోజు కర్ణాటక రాష్ట్రం గుల్బర్గ నుంచి తెచ్చిన గంధాన్ని ఉర్సు నిర్వాహకుల ఇంట్లో ఉంచి ప్రత్యేక పూజల అనంతరం తాసీల్దార్ కార్యాలయానికి తరలిస్తారు. అక్కడి నుంచి అధికారికంగా తాసీల్దార్ తలపై పెట్టుకుని మేళతాళాల మధ్య దర్గాకు తరలిస్తారు. ఉర్సు చివరిరోజు మహిళల ఉర్సు నిర్వహిస్తారు. ఎక్కడా లేని విధంగా అలంపూర్ షా-అలీ ఫహీల్వాన్ ఉర్సులో మహిళలకు ప్రత్యేక